సాక్షి
కుమురం భీం

మంగళవారం । 27 । జూన్ । 2023



'కొయ్య' కొరత తీర్చేలా..

నిర్మల్ కొయ్య బొమ్మల తయారీకి పొనికి చెట్ల కలపే ముడిసరుకు. కలప కొరతను అరికట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం పొనికి మొక్కల పెంపకానికి చర్యలు చేపట్టింది. 8లో▸



కన్నబిడ్డను చూడకుండానే..

మాతృత్వపు మాధుర్యం అనుభవించకుండానే రంజిత(21) అనే బాలింత ఫిట్స్‌తో మృతి చెందింది. పుట్టిన బిడ్డ ప్రస్తుతం ఐసీయూలో చికిత్స పొందుతోంది. 8లో▸

గరిష్టం/కనిష్టం
27.6 /25.4

వాతావరణం

ఉష్ణోగ్రతలు బాగా తగ్గుతాయి. ఆకాశం పూర్తిగా మేఘావృతమై ఉంటుంది. రుతుపవనాల ప్రభావంతో జిల్లాలోని చాలా ప్రాంతాల్లో వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

ఆర్టీసీ డిపోలో నేడు రక్తదాన శిబిరం

ఆసిఫాబాద్: జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ డిపోలో మంగళవారం రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నట్లు డీఎం శ్రీధర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆర్టీసీ కార్మికులు, సిబ్బంది, యువజన సంఘాలు, విద్యార్థులు అధిక సంఖ్యలో హాజరై రక్తదానం చేయాలని కోరారు. రక్తదాతలు తమ పేర్లు నమోదు చేసుకునేందుకు 73828 41679 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

ఆసిఫాబాద్ సీఐగా సురేశ్



బాధ్యతలు స్వీకరిస్తున్న సీఐ సురేశ్

ఆసిఫాబాద్: ఆసిఫాబాద్ సీఐగా జవ్వాజి సురేశ్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. కరీంనగర్ జిల్లా జమ్మికుంట సీఐగా పనిచేస్తున్న సురేశ్ బదిలీపై ఆసిఫాబాద్‌కు రాగా, ఇక్కడ పనిచేస్తున్న సీఐ రాణాప్రతాప్ ఎస్పీకి బదిలీ అయ్యారు. బాధ్యతలు స్వీకరించిన సీఐకి ఎస్సైలు రమేశ్, గంగన్న, సందీప్, రాజేశ్వర్, సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

ఘనంగా సాహూ మహారాజ్ జయంతి



నివాళులర్పిస్తున్న ఆరె సంఘం నాయకులు

ఆసిఫాబాద్: ఛత్రపతి శివాజీ మహారాజ్ వారసుడు ఛత్రపతి సాహూ మహారాజ్ 149వ జయంతిని సోమవారం జిల్లా కేంద్రంలో ఆరె సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సాహూ మహారాజ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆరె సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు బొట్టుపెల్లి జయరాం మాట్లాడుతూ సాహూ మహారాజ్ దేశంలో తొలిసారిగా రిజర్వేషన్ల ప్రతిఫలాలను అందించిన గొప్ప వ్యూహకర్త అని అన్నారు. రిజర్వేషన్ల పితామహుడని కొనియాడారు. కార్యక్రమంలో నాయకులు కోలె బిక్కాజీ, బోర్కుటే తిరుపతి, బొట్టుపల్లి అన్నారావు, నాగపురి మారుతి, రమేశ్, గెడెకర్ సంతోష్ పాల్గొన్నారు.

ఘనంగా వి.పి.సింగ్ జయంతి



నివాళులర్పిస్తున్న నాయకులు

ఆసిఫాబాద్: జిల్లా కేంద్రంలోని బీసీ సంక్షేమ సంఘ భవనంలో సోమవారం మాజీ ప్రధాని స్వర్గీయ వి.పి.సింగ్ జయంతి ఘనంగా జరుపుకొన్నారు. బీసీ సంఘం నాయకులు వి.పి.సింగ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు రూప్‌నర్ రమేశ్, ప్రధాన కార్యదర్శి గాజుల జక్కయ్య, రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు వైరాగడే మారుతి, ఉమేందర్ పాల్గొన్నారు.

కాంట్రాక్ట్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి



మాట్లాడుతున్న లోకేశ్

ఆసిఫాబాద్: మిషన్ భగీరథ పథకంలో పనిచేస్తున్న కాంట్రాక్టు ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ నాయకుడు, మిషన్ భగీరథ కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు అల్లూరి లోకేశ్ డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని సంఘ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. భగీరథ కాంట్రాక్టు కార్మికుల సమస్యలు యాజమాన్యం పరిష్కారం చేయకుండా ఇబ్బందులకు గురి చేస్తుందని ఆరోపించారు. కనీస వేతనాల జీవో, పీఆర్సీ వేతనాల జీవో 60ని అమలు చేయకుండా వెట్టిచాకిరీ చేయిస్తున్నారని మండిపడ్డారు. మిషన్ భగీరథ కాంట్రాక్టు కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలని, కనీస వేతనం రూ.26 వేలు చెల్లించాలని, కాంట్రాక్టర్ల వేధింపులు, తొలగింపులు ఆపాలని కోరారు. సమావేశంలో సంఘ నాయకులు మధుకర్, అంబాజీరావు, దేవేందర్, హరీశ్, వెంకటేశ్, శుభం, బాలేశ్, క్రాంతి దీప్ పాల్గొన్నారు.

ఆప్తుల మధ్య ఆస్తి తగాదాలు

- అనుబంధాలపై తీవ్ర ప్రభావం
- జిల్లాలో పెరుగుతున్న భూకక్షలు
- రెబ్బెన మారణకాండే దీనికి నిదర్శనం
- ప్రజావాణిలో నిత్యం ఇలాంటి ఫిర్యాదులే..
- భూతగాదా కేసుల్లో ఇరువర్గాలపై పోలీసుల నిఘా అవసరం



జక్కులపెల్లిలో మృతదేహాలను పరిశీలిస్తున్న ఎస్పీ సురేశ్‌కుమార్

సాక్షి, ఆసిఫాబాద్: ఆస్తి తగాదాలు ఆప్తుల మధ్య అంతరాన్ని పెంచుతున్నాయి. ఏళ్లకు ఏళ్లు పోలీసుస్టేషన్లు, కోర్టుల చుట్టూ తిరుగుతున్న కుటుంబాలు జిల్లాలో కోకొల్లలు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో ప్రతి సోమవారం జరిగే ప్రజావాణిలో ఇలాంటి ఫిర్యాదులే అధికంగా వస్తుండడం పరిస్థితికి అద్దం పడుతున్నాయి. చివరికి అన్నదమ్ములు.. దాయాదులు.. స్నేహితుల మధ్య కక్షలు పెంచుకునే స్థాయికి ఈ గొడవలు తీసుకెళ్తున్నాయి. క్షణికావేశంలో ఒకరిపై ఒకరు దాడులు దిగుతుండగా.. ఒక్కోసారి చంపడానికి సైతం వెనుకాడని పరిస్థితులు దాపురిస్తున్నాయి. సోమవారం రెబ్బెన మండలం జక్కులపెల్లి గ్రామంలో జరిగిన మారణకాండలో ఇద్దరు మృత్యువాత పడగా.. మరో నలుగురి పరిస్థితి విషమంగా ఉంది.

భూసమస్యలు అధికం..

ధరణి పోర్టల్ వచ్చిన తర్వాత జిల్లాలో భూసమస్యల సంఖ్య నానాటికీ పెరుగుతూనే ఉంది. ధరణి రాక ముందు రిజిస్ట్రేషన్ చేయించుకున్న భూములు ఆ తర్వాత మ్యుటేషన్ చేయించుకోకపోతే ఆ భూములన్నీ మళ్లీ ధరణిలో పాత పేర్లపైనే కనిపిస్తున్నాయి. దీనిని ఆసరాగా తీసుకుని కొందరు ఆయా భూములు తమవే అని మళ్లీ అమ్ముకుంటున్నారు. భూముల ధరలు పెరగడంతో అనేక వివాదాలకు దారి తీస్తోంది. ధరణిలో పాత యజమానుల పేర్లు వస్తున్నా.. తహసీల్దార్లు ఏమి చేయలేకపోతున్నారు. బాధితులు సంప్రదిస్తే న్యాయస్థానాన్ని ఆశ్రయించాలని సూచిస్తున్నారు. ప్రతి సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించే ప్రజావాణికి సైతం 90 శాతం దరఖాస్తులు భూవివాదాలకు సంబంధించినవే ఉంటున్నాయి. కోర్టులకు వెళ్లిన సర్వే నంబర్లన్నింటికి ధరణిలో ఎలాంటి లావాదేవీలు జరపకుండా నిలిపివేస్తున్నారు. దీంతో చాలా మంది ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు. అలాగే వంశపారంపర్యంగా దఖలు అయిన ఆస్తి పంపకాల్లోనూ సొంత అన్నదమ్ముల నడుమ వివాదాలు అనేకం ఉంటున్నాయి. ఒక వర్గానికి అధికారపార్టీ నాయకులు అండగా ఉండడం.. మరొకరు రెవెన్యూ, పోలీసు అధికారులను ఆశ్రయిస్తున్నప్పటికీ సమస్యలు పరిష్కారం కావడం లేదు. సర్వేయర్‌తో కొలతలు వేయించి ఆస్తి పంపకాలు జరిపితే తీరే తగవును తెగే దాకా లాగుతుండడంతో కక్షలు పెరుగుతున్నాయి.

- 'స్థలం జోలికొస్తే.. చంపేసి తుమ్మచెట్లలో పడేసి గ్యాస్ నూనె పోసి అగ్గిపెడతాం'అంటూ మూడేళ్లుగా రెబ్బెన మండలం రోళ్లపాడు గ్రామానికి చెందిన ఆదివాసీ మహిళ బత్తిన లక్ష్మిని ఆమె బంధువులు, స్థానిక బీఆర్‌ఎస్ నేతలు కలిసి బెదిరిస్తున్న వైనాన్ని ఏప్రిల్ 25న 'సాక్షి' వెలుగులోకి తెచ్చిన సంగతి తెలిసిందే. వార్త వచ్చిన రాత్రే ఆమెను కొందరు గుర్తు తెలియని వ్యక్తులు ఇంటికెళ్లి చంపేస్తామని బెదిరించారు. కలెక్టర్, ఎస్పీకి ఫిర్యాదు చేసిన అనంతరం ఈ ఘటన జరిగితే పట్టించుకునేవారు లేకపోవడం శోచనీయం. రెండు నెలలుగా అటు రెవెన్యూ, ఇటు పోలీసులు ఈ కేసు పరిష్కారంలో తాత్సారం చేస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇది వరకే కట్టుకున్న భర్తను పోగొట్టుకున్న బత్తిన లక్ష్మి చివరకు ప్రాణం మీద ఆశతో రాజీకి వచ్చినట్లు తెలుస్తోంది.
- జిల్లా కేంద్రంలో మరో భూ వివాదం తారాస్థాయికి చేరింది. గుండి వెళ్లే రహదారిలో ఫోర్‌లైన్ పక్కన 33 ఏళ్లుగా రెండెకరాల భూమిపై కొందరు కబ్జాదారులు కన్నేయడమే కాకుండా దర్జాగా ఆ స్థలాన్ని ఆక్రమించారు. పైగా కబ్జాదారులే పోలీసుస్టేషన్ మెట్లెక్కి భూ యజమానులపై తప్పుడు కేసులు పెట్టారని బాధితులు ఆరోపిస్తున్నారు. దీంతో బాధితులు కోర్టును ఆశ్రయించి.. స్థలంలో కోర్టు నోటీసు హెచ్చరిక బోర్డు సైతం పెట్టినా ఫలితం లేదు. మళ్లీ యథావిధిగా కబ్జాదారులు ఈ స్థలం మాదేనంటూ దౌర్జన్యంగా ఆ బోర్డును తొలగించారు. ఇలా జిల్లాలో కోకొల్లలుగా భూ వివాదాలు ఉన్నాయి. వీటన్నింటికీ ఎక్కడో ఒకచోట పరిష్కారం చూపకపోతే జిల్లాలో జక్కులపల్లి లాంటి ఘటనలు పునరావృతం అయ్యే అవకాశాలు ఉన్నాయని జిల్లా ప్రజలు చెబుతున్నారు. పోలీసులు, రెవెన్యూ అధికారులు దీనిపై దృష్టి సారించాలని వారు కోరుతున్నారు.

ఇద్దరి ప్రాణాలు బలిగొన్న భూతగాదా

- వారసత్వంగా వచ్చిన భూమికోసం కొట్టుకున్న ఇరువర్గాలు



రోదిస్తున్న బక్కుబాయి బంధువులు



నర్సయ్య, బక్కుబాయి మృతదేహాలు

రెబ్బెన(ఆసిఫాబాద్): వారసత్వంగా వచ్చిన భూమి విషయంలో ఏర్పడిన తగాదాలు చివరికి ఇద్దరి ప్రాణాలను బలిగొన్నాయి. దాయాదులు భూమి కోసం కర్రలు, గొడ్డళ్లతో దాడులు చేసుకోవడంతో పచ్చని పంటలు పండాల్సిన నేలకు ఎర్రటి నెత్తుటి మరకలు అంటుకున్నాయి. ఒక వర్గం భూమిలో విత్తనాలు వేయగా.. మరో వర్గం మోఖాపైకి వెళ్లడంతో ఇరువర్గాల మధ్య ఘర్షణ చోటుచేసుకుంది. గ్రామస్తుల కథనం ప్రకారం.. రెబ్బెన మండలం జక్కులపెల్లి గ్రామానికి చెందిన మండల భీమయ్య, మండల నాగయ్య సోదరులు. వారి వారసుల మధ్య గ్రామ శివారులోని 111 సర్వే నంబర్‌లో వారసత్వంగా వచ్చిన సుమారు తొమ్మిదెకరాల భూమి విషయంలో తగాదా ఉంది. పెద్దల సమక్షంలో పంచాయితీలు కూడా జరిగాయి. ఎన్నో ఏళ్లపాటు వివాదంలో ఉన్న భూమిని ఎవ్వరూ కూడా సాగు చేయకుండానే పడావుగా వదిలేశారు. ఇదిలా ఉండగా.. గతేడాది భీమయ్య వారసులైన మండల బక్కయ్య, దుర్గయ్య, గిరుగుల బక్కుబాయి అలియాస్ బక్కమ్మలు వివాదంలో ఉన్న భూమిని చదును చేశారు. ఈ ఏడాది సాగు చేయడం ప్రారంభించారు. ఆదివారం చేనులో పత్తి విత్తనాలు సైతం విత్తారు. ఈ విషయం తెలుసుకున్న నాగయ్య వారసులైన మల్లేశ్, మెంగయ్య తమ కుమారులు, బంధువులను తీసుకుని చేను వద్దకు వెళ్లారు. ఇరువర్గాలు ఘర్షణ పడి ఒకరిపై ఒకరు కర్రలు, గొడ్డళ్లతో దాడి చేసుకున్నారు. ఈ దాడిలో మండల నర్సయ్య (30), గిరుగుల బక్కుబాయి(60) అక్కడికక్కడే మృతి చెందగా, మండల బక్కయ్య, పెంటయ్య, మల్లేశ్, మెంగయ్యకు తీవ్ర గాయాలయ్యాయి. బక్కయ్య, మెంగయ్యల పరిస్థితి విషమంగా ఉంది. సమాచారం అందుకున్న రెబ్బెన సీఐ అల్లం నరేందర్, ఎస్సై భూమేశ్ ఘటన స్థలానికి చేరుకుని కారణాలపై ఆరా తీశారు. గాయపడిన వారిని హుటాహుటిన బెల్లంపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం మంచిర్యాలకు తరలించారు.

పరిస్థితిని సమీక్షించిన ఎస్పీ

భూవివాదం కారణంగా ఇరువర్గాల దాడిలో ఇద్దరు మృతి చెందిన సమాచారం అందుకున్న ఎస్పీ సురేశ్‌కుమార్ హుటాహుటిన డీఎస్పీ శ్రీనివాస్‌తో కలిసి జక్కులపల్లికి చేరుకున్నారు. మృతదేహాలను పంచాయతీ ట్రాక్టర్ ద్వారా గ్రామానికి తరలిస్తుండగా మార్గమధ్యలో ఎస్పీ పరిశీలించారు. ఘర్షణకు దారి తీసిన పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు.

సమస్యల పరిష్కారానికి చర్యలు

- ఇన్‌చార్జి డీఆర్‌వో రాజేశ్వర్
- ప్రజావాణిలో అర్జీలు స్వీకరణ




అర్జీలు స్వీకరిస్తున్న ఇన్‌చార్జి డీఆర్‌వో రాజేశ్వర్

ఆసిఫాబాద్: ప్రజావాణిలో అధికారుల దృష్టికి వచ్చిన సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని ఇన్‌చార్జి డీఆర్‌వో రాజేశ్వర్ అన్నారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం ప్రజావాణి నిర్వహించారు. వివిధ ప్రాంతాలకు చెందిన ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. తమకు ఇంటి స్థలాలు ఉన్నాయని, ప్రభుత్వం సొంతంగా ఇల్లు నిర్మించుకునేందుకు గృహలక్ష్మి పథకం కింద ఆర్థికసాయం అందించాలని సిర్పూర్(టి) మండలం పారిగాం గ్రామానికి చెందిన సత్పతే సురేఖ, వెంకట్రావుపేటకు చెందిన లోనారె వందన బాయి, ఆసిఫాబాద్ మండలం అడ గ్రామానికి చెందిన నాగోశ విమలాబాయి, బాబాపూర్‌కు చెందిన వేల్పుల హనుమక్క వేర్వేరుగా అర్జీలు సమర్పించారు. కూలీ పనులు చేసుకుంటున్న తమకు ప్రభుత్వం డబుల్ బెడ్రూం ఇళ్లు మంజూరు చేయాలని ఆసిఫాబాద్ మండల కేంద్రానికి చెందిన ధర్మాయే సునీత, కెరమెరి మండలం నిషానికి చెందిన మొహర్లే జయసుధ వేర్వేరుగా దరఖాస్తు చేసుకున్నారు. వీరితోపాటు సమస్యలు పరిష్కరించి అండగా నిలవాలని పలువురు అర్జీలు సమర్పించారు. వివిధ శాఖలకు చెందిన అధికారులు పాల్గొన్నారు.

మాదకద్రవ్యాలతో ఆరోగ్యానికి హాని

- జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ సెక్రెటరీ యువరాజ్
- విద్యార్థినులకు డ్రగ్స్‌పై అవగాహన



మాట్లాడుతున్న జడ్జి యువరాజ్

ఆసిఫాబాద్: మాదకద్రవ్యాలు ఆరోగ్యానికి హాని కలిగిస్తాయని, వాటి వినియోగం ప్రమాదకర వ్యసనమని జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ సెక్రెటరీ, సీనియర్ సివిల్ జడ్జి యువరాజ్ అన్నారు. జిల్లా కేంద్రంలోని గిరిజన బాలికల గురుకుల పాఠశాలలో సోమవారం ప్రపంచ డ్రగ్ డే పురస్కరించుకుని విద్యార్థినులకు మాదక ద్రవ్యాల వినియోగంతో కలిగే నష్టాలపై అవగాహన, న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సీనియర్ సివిల్ జడ్జి మాట్లాడుతూ యువతరాన్ని దారి మళ్లించి, చెడుమార్గాల్లో నడిపిస్తున్న దురలవాట్లలో మాదక ద్రవ్యాల వినియోగం తీవ్రమైందన్నారు. నిషేధిత మత్తు పదార్థాలు ఎక్కడ కనిపించినా పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. కార్యక్రమంలో డీఎల్ఎస్ఏ ప్యానల్ న్యాయవాది పూదరి నరహరి, లీగల్ అసిస్టెంట్ అంజన దేవి, పారా లీగల్ వలంటీర్ హరీశ్, ప్రిన్సిపాల్ జ్యోతిలక్ష్మి, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

జంగుబాయి క్షేత్రాన్ని అభివృద్ధి చేస్తాం

- రాజురా ఎమ్మెల్యే సుభాశ్ ధోటే



పనులు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే సుభాశ్ ధోటే

కెరమెరి(ఆసిఫాబాద్): ఆదివాసీ ఆరాధ్య దైవమైన జంగుబాయి అమ్మవారి పుణ్యక్షేత్రాన్ని మరింత అభివృద్ధి చేస్తామని మహారాష్ట్రలోని రాజురా నియోజకవర్గ ఎమ్మెల్యే సుభాశ్ ధోటే అన్నారు. కెరమెరి మండలంలోని తెలంగాణ, మహారాష్ట్ర సరిహద్దుల్లో కొలువైన జంగుబాయి అమ్మవారి క్షేత్రంలో కొనసాగుతున్న అభివృద్ధి పనులను సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీసీ రోడ్డు పనులు నాలుగు రోజుల్లో పూర్తవుతాయని తెలిపారు. ఆలయానికి వచ్చే భక్తులకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటామన్నారు. టొప్లకస వాగుపై రూ.4.58 కోట్లతో వంతెన నిర్మాణం, రూ.27లక్షలతో విద్యుత్ సౌకర్యం కల్పించామని పేర్కొన్నారు. దర్బార్ హాల్ నిర్మాణానికి రూ.25 లక్షలు మంజూరు చేస్తున్నామని ప్రకటించారు. డిసెంబర్, జనవరిలో జరిగే ఉత్సవాల నాటికి పైప్‌లైన్ ద్వారా తాగునీటిని అందిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఆర్అండ్‌బీ డీఈ పోకడే, ఆలయ కమిటీ చైర్మన్(మహారాష్ట్ర) వెట్టి చందు, కార్యదర్శి సీతారాం, కటోడాలు దివాకర్, వల్క బాజీరావు, గోవింద్‌రావు తదితరులు ఉన్నారు.

సీఎం పర్యటన విజయవంతం చేయాలి

- రాష్ట్ర మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి
- బీఆర్‌ఎస్ ముఖ్య నాయకులతో సన్నాహక సమావేశం



ఐక్యత తెలుపుతున్న మంత్రి ఐకే రెడ్డి, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు కోనప్ప, తదితరులు

ఆసిఫాబాద్: జిల్లా కేంద్రంలో ఈ నెల 30న ముఖ్యమంత్రి చంద్రశేఖరరావు పర్యటన విజయవంతం చేయాలని రాష్ట్ర అటవీ పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని ఒడ్డెపల్లి గార్డెన్‌లో సోమవారం బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే కోనేరు కోనప్ప అధ్యక్షతన బీఆర్‌ఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్సీ దండె విఠల్, జెడ్పీ చైర్‌పర్సన్ కోవ లక్ష్మి, ఎమ్మెల్యే ఆత్రం సక్కుతో కలిసి మంత్రి హాజరయ్యారు. మంత్రి ఐకే రెడ్డి మాట్లాడుతూ బీఆర్‌ఎస్ శ్రేణులు సమన్వయంతో పని చేసి సీఎం పర్యటనను విజయవంతం చేయాలని కోరారు. జిల్లా కేంద్రంలో నిర్వహించే బహిరంగ సభకు అన్ని మండలాల నుంచి బీఆర్‌ఎస్ శ్రేణులు, ప్రజలు, అభిమానులు పెద్దసంఖ్యలో తరలి వచ్చేలా చూడాలని సూచించారు. బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు కోనప్ప మాట్లాడుతూ పార్టీ నాయకులు ఉదయం 9 గంటలకే జిల్లా కేంద్రానికి చేరుకోవాలన్నారు. బహిరంగ సభకు వచ్చేవారి కోసం మూడుచోట్ల భోజన వసతి ఏర్పాటు చేస్తామని తెలిపారు. సోషల్ మీడియాలో తమపై వచ్చే వదంతులు నమ్మొద్దన్నారు. సమావేశంలో మాజీ ఎంపీ నగేశ్, ఆదిలాబాద్ జెడ్పీ చైర్మన్ రాథోడ్ జనార్దన్, జెడ్పీ వైస్‌చైర్మన్ కోనేరు కృష్ణారావు, జెడ్పీటీసీ అరిగెల నాగేశ్వర్‌రావు, ఎంపీపీలు, జెడ్పీటీసీలు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి

ఆసిఫాబాద్: సీఎం జిల్లా పర్యటనకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని రాష్ట్ర మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలో ఈ నెల 30న సీఎం ప్రారంభించే సమీకృత కలెక్టరేట్, ఎస్పీ కార్యాలయాన్ని కలెక్టర్ హేమంత్ బోర్కడే, ఎస్పీ సురేశ్‌కుమార్, అదనపు కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్, ఎమ్మెల్సీ దండె విఠల్, జెడ్పీ చైర్‌పర్సన్ కోవ లక్ష్మి, ఎమ్మెల్యేలు కోనేరు కోనప్ప, ఆత్రం సక్కుతో కలిసి పరిశీలించారు. మంత్రి మాట్లాడుతూ రక్షణ, భోజన వసతి, ట్రాఫిక్, తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఆయన వెంట జెడ్పీటీసీ అరిగెల నాగేశ్వర్‌రావు తదితరులు ఉన్నారు.

పఠన నైపుణ్యాలు పెంచాలి



విద్యార్థులతో చదివిస్తున్న ఇన్‌చార్జి డీఈవో

ఆసిఫాబాద్‌రూరల్: విద్యార్థుల్లో పఠన నైపుణ్యాన్ని మరింత పెంచాలని ఇన్‌చార్జి డీఈవో ఉదయ్ అన్నారు. జిల్లా వ్యాప్తంగా అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో సోమవారం నుంచి పఠనోత్సవం ప్రారంభమైంది. ఉపాధ్యాయులు విద్యార్థులతో వివిధ రకాల పుస్తకాలు చదివించారు. కాగజ్‌నగర్ మండలంలోని చింతగూడ పాఠశాలలో ఇన్‌చార్జి డీఈవో పఠనోత్సవాన్ని ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ జిల్లాలోని అన్ని పాఠశాలల్లో జూలై 31 వరకు ప్రతిరోజూ ఒక గంట విద్యార్థులతో కథల పుస్తకాలు చదివించాలని ఆదేశించారు. పుస్తక పఠనంతో విద్యార్థుల్లో మేధోశక్తి, నైపుణ్యం పెరుగుతాయని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా సైన్స్ అధికారి మధుకర్, ఎస్‌వో శ్రీనివాస్, స్వర్ణ, ఎంఈవో భిక్షపతి, హెచ్.నజీర్, తదితరులు పాల్గొన్నారు.

సమన్వయంతో పనిచేయాలి



మాట్లాడుతున్న కలెక్టర్ హేమంత్ బోర్కడే, పక్కన ఎస్పీ సురేశ్‌కుమార్, అధికారులు

- కలెక్టర్ హేమంత్ బోర్కడే
- సీఎం పర్యటనపై అధికారులతో సమీక్షా సమావేశం

ఆసిఫాబాద్: ముఖ్యమంత్రి కేసీఆర్ జిల్లా పర్యటనను విజయవంతం చేసేందుకు అధికారులు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ హేమంత్ బోర్కడే అన్నారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం ఎస్పీ సురేశ్‌కుమార్, అదనపు కలెక్టర్ రాజేశంతో కలిసి వివిధ శాఖల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ సమీకృత కలెక్టరేట్, ఎస్పీ పోలీసు కార్యాలయం, బీఆర్‌ఎస్ భవనం ప్రారంభోత్సవాలతోపాటు కుమురంభీం, కొట్నాక భీమ్‌రావు విగ్రహాల ఆవిష్కరణలు, అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను సీఎం ప్రారంభిస్తారని తెలిపారు. అగ్నిమాపక శాఖ, వైద్యారోగ్య శాఖ ఆధ్వర్యంలో అంబులెన్స్‌లు సిద్ధంగా ఉంచాలన్నారు. అధికారులు, ప్రముఖులకు భోజన వసతికి అన్నిఏర్పాట్లు చేయాలన్నారు. ప్రముఖులకు స్వాగతం పలికే అధికారులు బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తించాలని ఆదేశించారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, ఉన్నతాధికారులు రానున్న నేపథ్యంలో బహిరంగ సభ నిర్వహణకు అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఆసిఫాబాద్, సిర్పూర్ నియోజకవర్గాల్లో ఆరుగురి చొప్పున ఎంపిక చేసి పోడు భూముల పట్టాలు అందిస్తారని తెలిపారు. మీడియా పాసులు, ప్రోటోకాల్ ఆహ్వాన పత్రికల పంపిణీ కార్యక్రమాలను నిర్వహించాలన్నారు. విగ్రహావిష్కరణ కార్యక్రమంలో పూల అలంకరణ ఏర్పాట్లపై ఉద్యానవనశాఖ అధికారులు బాధ్యత వహించాలని తెలిపారు. సమీకృత కలెక్టరేట్ భవనాన్ని పూలు, విద్యుత్ దీపాల కాంతులతో అందంగా అలంకరించాలని ఆదేశించారు. సమావేశంలో ఆర్డీవో రాజేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఉపాధి కూలీలపై తేనెటీగల దాడి

– ఒకరి పరిస్థితి విషమం



చికిత్స పొందుతున్న కూలీలు

జన్నారం: మండలంలోని తిమ్మాపూర్ గ్రామానికి చెందిన 40 మంది ఉపాధి కూలీలపై తేనెటీగలు దాడి చేశాయి. ఒకరి పరిస్థితి విషమంగా ఉంది. వివరాలు ఇలా ఉన్నాయి..సమీప అటవీ ప్రాంతంలో వందమంది కూలీలు సోమవారం ఉపాధి హామీ పనులు చేపడుతున్నారు. ఆ ప్రాంతంలో పొదలో తేనెటీగలు తెట్టె పెట్టాయి. గమనించకుండా బండరాళ్లను పొదలో వేయడంతో తేనెటీగలు ఒక్కసారిగా కూలీలపై దాడి చేసి కుట్టాయి. కొందరు పరుగులు తీశారు. గాయపడినవారిని సర్పంచ్ జాడి గంగాధర్ తాళ్లపేట్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వైద్యులు వారికి ప్రథమ చికిత్స చేశారు. వంద చోట్ల తేనెటీగలు కుట్టడంతో దేవ లింగన్న పరిస్థితి విషమించడంతో మంచిర్యాల ఆసుపత్రికి తరలించారు. మిగతా కూలీలు చికిత్స అనంతరం ఇళ్లకు వెళ్లారు.

30న జాబ్‌మేళా

ఉట్నూర్‌రూరల్: ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని గిరిజన నిరుద్యోగ యువతి, యువకుల కోసం ఉట్నూర్‌లోని యూత్ ట్రైనింగ్ శిక్షణ కేంద్రంలో ఈనెల 30న జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు ఐటీడీఏ పీవో వరుణ్‌రెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటలకు ఈ మేళా ఉంటుందని పేర్కొన్నారు. ఎంఎస్ఎన్ ల్యాబొరేటరీస్, బయోఆర్గానిక్, ఫ్లిప్‌కార్ట్, క్రీమ్‌స్టోన్, మెడ్‌ప్లస్ కంపెనీల్లో 325 ఉద్యోగాలకు ఎంపిక ఉంటుందని వివరించారు. మేళాలో పాల్గొనేవారు 18–35 ఏళ్లలోపు ఉండాలని పేర్కొన్నారు. బయోడేటా, విద్యార్హత, కుల ధ్రువీకరణ పత్రాల జిరాక్స్ కాపీలతో హాజరుకావాలని సూచించారు. వివరాలకు 78936 16392 సెల్‌నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

షూటింగ్ చాంపియన్‌షిప్ పోటీల్లో ప్రతిభ



ఉన్నతాధికారులతో విజేతలు

ఆసిఫాబాద్/కౌటాల: తెలంగాణ స్టేట్ 9వ షూటింగ్ చాంపియన్ షిప్ 2023–24 పోటీల్లో కౌటాల పోలీస్‌స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న మహిళా కానిస్టేబుల్ బి.స్రవంతి ప్రతిభ కనబర్చింది. ఈ పోటీల్లో 10 ఎం.ఎయిర్ పిస్టల్ పోటీల్లో రజత పతకం సాధించి విజేతగా నిలిచింది. హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో విజేతలను డీజీపీ అంజనీకుమార్ మెడల్స్ అందజేశారు. స్రవంతి విజేతగా నిలవడం జిల్లాకే గర్వకారణమని ఎస్పీ సురేశ్‌కుమార్, కౌటాల సీఐ సాధిక్ పాషా తెలిపారు.

కొయ్య కొరత తీర్చేలా..



పానికి కర్రతో నిర్మల్ బొమ్మలు తయారు చేస్తున్న కళాకారులు

- నిర్మల్ జిల్లాలో పానికి వనాల పెంపకానికి చర్యలు
- అనువైన స్థలాలు గుర్తింపు
- హరితహారంలో మొక్కలు నాటేలా చర్యలు
- బొమ్మల తయారీకి ఊతమిచ్చేలా..

నిర్మల్‌ఖిల్లా: నిర్మల్ అనగానే మొదట గుర్తొచ్చేది కొయ్యబొమ్మలే..వీటి తయారీ పరిశ్రమ కొలువుదీరింది ఇక్కడే. పానికి చెట్టు నుంచి తీసే కలప ముడిసరుకుతో ఈ బొమ్మలను కళాకారులు తయారు చేస్తారు. ఈ కర్ర మృదువుగా, తేలికగా ఉపయోగించవచ్చు. ప్రస్తుతం అడవుల్లో పానికి చెట్లు కనుమరుగవడంతో జిల్లాలో గత ఐదారేళ్లుగా బొమ్మల తయారీ పరిశ్రమ తీవ్ర సంక్షోభం ఎదుర్కొంటోంది. దాదాపు 150 కళాకారుల కుటుంబాలు ఈ పరిశ్రమపై ఆధారపడి జీవిస్తున్నాయి. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం పానికి మొక్కల పెంపకానికి చర్యలు చేపట్టింది. ఈ మేరకు మొక్కల పెంపకానికి అనువైన ప్రాంతాలను అధికారులు గుర్తించారు. హరితహారంలో భాగంగా మొక్కలు నాటారు. ఉపాధి హామీ పథకంలో భాగంగా సంరక్షణ చర్యలు చేపడుతున్నారు.



అడవుల్లో సహజసిద్ధంగా పెరిగే పానికి చెట్టు

పానికి కర్ర ప్రత్యేకం..

నిర్మల్ కొయ్యబొమ్మల తయారీకి ఉపయోగించే పానికి చెట్టు నుంచి తీసిన కలప చాలా ప్రత్యేకం. ఎందుకంటే ఈ పానికి కర్ర తేలికగా సరళంగా ఉండి, బొమ్మను చెక్కే క్రమంలో మృదువుగా ఉంటుంది. బొమ్మల తయారీలో కళాఖండంగా తీర్చిదిద్దవచ్చు. అందుకే పానికి కర్రను వినియోగిస్తామని కళాకారులు అంటున్నారు.

పానికి మొక్కల పెంపునకు అనువైన ప్రాంతాలు..

పానికి మొక్కల పెంపకం కోసం ప్రయోగాత్మకంగా పలు గ్రామ పంచాయతీలను డీఆర్డీఏ, ఇతర అధికారులు ఎంపిక చేశారు. మట్టి నమూనా పరీక్షల ఆధారంగా మామడ మండలం కొరిటికల్, గాయిద్‌పెల్లి, మొండిగుట్ట, తాండ్ర, వాస్తాపూర్, లింగాపూర్, తోటిగూడ, రాయదారి, సారంగాపూర్ మండలం గోపాల్‌పేట్ సమీపంలోని అటవీప్రాంతం అనువైనవిగా గుర్తించారు. ఇప్పటికే మట్టికి భూసార పరీక్ష అనంతరం ఇక్కడ మొక్కలు నాటి సంరక్షిస్తున్నారు. రాయదారి సమీపంలో 500 మొక్కలు నాటారు. మొదటగా లింగాపూర్ శివారులోని ప్రభుత్వ భూమిలో హరితహారం కింద వెయ్యి పానికి మొక్కలు నాటారు. వాస్తాపూర్, గాయిద్‌పెల్లి తదితర గ్రామాల్లో దశలవారీగా మొక్కల పెంపకం చేపట్టనున్నారు. సారంగాపూర్ మండలం గోపాల్‌పేట సమీపంలో మహబూబ్ ఘాట్స్ ప్రాంతంలో 2,200 మొక్కలు నాటారు. నీటి వసతి కోసం ప్రత్యేకంగా డీఆర్డీఏ అధికారులు బోర్‌వెల్ వేయించారు.



మామడ మండలంలో పానికి మొక్కలు నాటుతున్న అధికారులు

మొక్కలు నాటించాం



పానికి కర్రకు తీవ్రమైన కొరత ఏర్పడిన విషయాన్ని గుర్తించాం. జిల్లా కలెక్టర్ ప్రోత్సాహంతో హరితహారంలో మొక్కల ప్లాంటేషన్‌ను పకడ్బందీగా చేపడుతున్నాం. కొన్ని ప్రాంతాలను గుర్తించి మొక్కలు నాటించాం. సంరక్షణ చర్యలు తీసుకుంటున్నాం.

– కె.విజయలక్ష్మి, జిల్లా గ్రామీణాభివృద్ధిశాఖ అధికారి

హర్షణీయం



పానికి కలపతో తయారీ చేసిన కొయ్య బొమ్మలు ఎక్కువకాలం మన్నిక ఉంటాయి. వీటి తయారీపై ఆధారపడిన కళాకారుల కుటుంబాలు కర్ర కొరతతో ఇబ్బంది పడ్డాం. రాష్ట్ర ప్రభుత్వం, డీఆర్డీఏ అధికారులు జిల్లాలో పానికి వనాల పెంపకం చేపట్టాలని నిర్ణయం తీసుకోవడం హర్షణీయం.

– నాంపల్లి రాజశేఖర్‌వర్మ, కళాకారుడు, నిర్మల్

ఆర్టీఏలో వరుస దావత్‌ల జోరు

- అధికారులు, సిబ్బంది, ఏజెంట్ల తీరు
- రాష్ట్రస్థాయిలో ఘనత సాధించామంటూ పార్టీ
- ఆషాఢం అంటూ మరోసారి

మంచిర్యాలరూరల్(హాజీపూర్): మంచిర్యాల ఆర్టీఏ కార్యాలయం వరుస దావత్‌లతో వార్తల్లోకెక్కుతోంది. రాష్ట్ర స్థాయిలో జిల్లా అగ్రస్థానంలో ఉందని మొన్న.. ఆషాఢం కదా అని నిన్న దారి మైసమ్మ పేరుతో మేకను కోసి విందు చేసుకోవడం చర్చనీయాంశమైంది. జిల్లా రవాణా శాఖ ప్రభుత్వం విధించిన పన్నుల వసూళ్ల లక్ష్యాన్ని చేరుకుని రాష్ట్ర స్థాయిలో 3వ స్థానం సాధించింది. త్రైమాసిక, జీవితకాలం, ఫీజులు, సేవల పన్ను, తనిఖీలు, జరిమానాలతో ఏడాదిలో ఏకంగా రూ.61.24 కోట్లు వసూళ్లు చేసింది. దీంతో రవాణా శాఖ కమిషనర్, మంత్రి ద్వారా ప్రత్యేకంగా ప్రశంసలు అందుకున్నారు. ఈ ఆనందంలో విందుకు జిల్లా కేంద్రంలోని నడిబొడ్డున ఓ ఏసీ ఫంక్షన్ హాల్ వేదికైంది. ఈ నెల 15న జరిగిన కార్యక్రమంలో జిల్లా రవాణా శాఖ అధికారితోపాటు ఎంవీఐలు, ఏఓ, కార్యాలయ సిబ్బంది ఒకరికొకరు సన్మానించుకున్నారు. ఈ సభలో ఇక ముఖ్య అతిథులుగా జిల్లా వ్యాప్తంగా ఉన్న ఆర్టీఏ ఏజెంట్లు భాగస్వామ్యం అయ్యారు. వీరి కనుసన్నల్లోనే సన్మాన కార్యక్రమం విజయవంతంగా సాగింది. అక్కడే ఏర్పాటు చేసిన మందు, విందులో మునిగితేలారు.

తాజాగా ఆషాఢం.. ఆదివారం..

తాజాగా మరోసారి ఆర్టీఏ అధికారులు, సిబ్బందితోపాటు ఏజెంట్లు మిలాఖత్ కావడంతో ఈసారి వీరికి తోడుగా మరికొంత మంది తోడయ్యారు. ఇంకేముంది ఆషాఢం.. ఆపై ఆదివారం.. అంతా కలిసి ఆర్టీఏ కార్యాలయానికి ఓ మేకను మొక్కి బలిచ్చారు. మేక మాంసం పోగులను కూర వండేందుకు ఉపక్రమించారు. ఆర్టీఓ కార్యాలయ ఆవరణలోని టెస్ట్ ట్రాకింగ్ షెడ్ వద్ద ఉన్న రేకుల షెడ్‌లో వంటలు చేశారు. అక్కడ కార్యాలయ ప్రధాన ద్వారం ఎదురుగా ఉన్న ఓ చెట్టు నీడలో అంతా కలిసి మందు సేవించారు. ఆ మత్తులోనే పేకాటలో నిగ్నమయ్యారు. ఆర్టీఏ సిబ్బందితోపాటు ఏజెంట్లు కలిసి మందు, విందు చేసుకోవడంపై పలువురు ఇదేం చోద్యం అంటున్నారు. ఆర్టీఏ కార్యాలయ ఆవరణలో జరిగిన దావత్‌పై పూర్తి స్థాయి విచారణ మేరకు చర్యలు తీసుకుంటామని డీటీఓ కిష్టయ్య తెలిపారు.

ఒకే రోజు ఐదుచోట్ల చోరీలకు యత్నం

- వాచ్ రిపేరింగ్ షాపులో రూ.5 వేల అపహరణ
- కాగజ్‌నగర్‌లో ఘటన

కాగజ్‌నగర్‌టౌన్: ఒకరోజు ఐదుచోట్ల దుండగులు చోరీలకు యత్నించారు. పట్టణంలోని ఆదివారం రాత్రి ఈ ఘటనలు చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం..రాజీవ్‌గాంధీ చౌరస్తాలోని ఇండియన్ ఏటీఎం తలుపు తాళం పగులగొట్టి దుండగులు డబ్బులు చోరీకి యత్నించి విఫలమయ్యారు. సమీపంలోని ఓ పండ్ల బండి తాళాన్ని పగులగొట్టగా నగదు దొరకలేదు. మహాలక్ష్మి హోటల్‌లో ప్రవేశించి వస్తువులన్నీ పడేశారు. సాయిబు స్టాల్ షట్టర్ ఇరువైపులా తాళాలను పగలగొట్టి లోనికి జొరబడేందుకు విఫలయత్నం చేశారు. షటర్ లాక్ ఓపెన్‌కాకపోవడంతో వెనుదిరిగారు. అదేవిధంగా వాచ్ రిపేరింగ్ షాపు నుంచి రూ.5వేల నగదును ఎత్తుకెళ్లారు. సోమవారం ఉదయం యజమానులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. సమీపంలోని సీసీ కెమెరాల పుటేజీలను పోలీసులు పరిశీలిస్తున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.



వాచ్ సెంటర్‌లో చిందరవందరగా సామగ్రి

‘విందులు వద్దనడం సరికాదు’

శ్రీరాంపూర్: గనులపై కార్మికులు విందులు వద్దనడం సరికాదని ఏఐటీయూసీ డిప్యూటీ ప్రధాన కార్యదర్శులు ఎస్‌కే బాజీసైదా, కె.వీరభద్రయ్య ఓ ప్రకటనలో తెలిపారు. విందులు వద్దంటూ ఇటీవల యజమాన్యం విడుదల చేసిన ఉత్తర్వులను తీవ్రంగా ఖండిస్తున్నామని, వీటిని వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. కార్మికులు రిటైర్డ్ అయిన సందర్భంలోనూ, ప్రమాదాలు జరగకూడదని మైసమ్మకు మొక్కుకునే సందర్భంలో విందులు చేసుకోవడం ఆనవాయితీ పేర్కొన్నారు. ఆ ఉత్తర్వులను ఉపసంహరించుకోవాలని బీఎంఎస్ ఏరియా కార్యదర్శి నాతాడి శ్రీధర్‌రెడ్డి ప్రకటనలో తెలిపారు.

చిరుత దాడిలో లేగదూడ మృతి



పరిశీలిస్తున్న ఫారెస్టు అధికారులు

తిర్యాణి: మండలంలోని గిన్నెదరి రేంజ్ పరిధిలోని మందగూడ అటవీ ప్రాంతంలో లేగదూడపై చిరుత దాడి చేసి హతమార్చింది. ఫారెస్టు సెక్షన్ అధికారి శ్రీనివాస్ కథనం ప్రకారం.. ఆదివారం సాయంత్రం మందగూడ శివారులోని అటవీ ప్రాంతంలో నైతం లక్ష్మణ్‌కు చెందిన లేగదూడపై చిరుత దాడి చేసి చంపింది. కాగా, ఆ ప్రాంతాన్ని ఫారెస్టు అధికారులు సోమవారం పరిశీలించారు. చిరుత ఆనవాళ్లు లభించలేదని, సమీప గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. సెక్షన్, బీట్ అధికారులు శ్రీనివాస్, సూర్యరావు, అవినాష్, సురేశ్ ఉన్నారు.

మద్యం బాటిళ్ల ధ్వంసం కేసులో మహిళకు జైలు

మందమర్రిరూరల్: పట్టణంలోని పలు కిరాణా దుకాణాల్లో బెల్ట్ షాపులు నిర్వహించడంతో నిందితురాలు రామిళ్ల రాధిక అందులో జొరబడి మద్యం బాటిళ్లు ధ్వంసం చేశారనే కేసులో ఆమెకు 14 రోజుల జైలుశిక్ష విధిస్తూ జిల్లా ఫస్ట్ అడిషనల్ కోర్టు జడ్జి ఉపనిషధ్‌వాణి సోమవారం తీర్పునిచ్చారు. ఆమెను ఆదిలాబాద్ జిల్లా జైలుకు తరలించినట్లు ఎస్సై చంద్రకుమార్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మద్యం బాటిళ్ల ధ్వంసం చేయడంతో రాధికపై శుక్రవారం కేసు నమోదు చేశామన్నారు. శనివారం రాధికతోపాటు బత్తుల సరితను కోర్టుకు తరలిస్తుండగా రాధికకు అనారోగ్యంతో ఆసుపత్రిలో చేరారు. పరీక్ష అనంతరం సోమవారం కోర్టులో హాజరుపర్చగా, జడ్జి ఈ మేరకు తీర్పు వెలువరించారు. కాగా, రెండు రోజుల క్రితం సరితకు 14 రోజుల జైలుశిక్ష విధించగా, ఆసిఫాబాద్‌కు తరలించినట్లు పేర్కొన్నారు.

కన్నబిడ్డను చూడకుండానే..

- మూర్ఛవ్యాధితో బాలింత మృతి
- ఐసీయూలో చికిత్స పొందుతున్న పసికందు
- ఏడాది క్రితమే ప్రేమ వివాహం
- కెరమెరి మండలం సావర్‌ఖేడాలో విషాదం



రంజిత(ఫైల్)

కెరమెరి(ఆసిఫాబాద్): కన్నబిడ్డకు గోరుముద్దలు తినిపించాలని..ప్రేమగా లాలించాలని, చందమామను చూపిస్తూ ఊరించాలని.. ఎన్నో కలలు కన్న ఆ మాతృమూర్తి బిడ్డను చూడకుండానే కన్నుమూసింది. పండంటి బిడ్డకు జన్మనిచ్చిన రంజిత(21) మూర్ఛ వ్యాధితో చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందింది. మండలంలోని సావర్‌ఖెడాలో విషాదం చోటుచేసుకుంది.కుటుంబీకులు తెలిపిన వివరాలు.. సావరఖెడా గ్రామానికి చెందిన మహండోరే సోనాజి, తానుబాయిల దంపతుల కూతురు రంజితను రాంనగర్ గ్రామానికి చెందిన వసాకే శ్రీనివాస్‌తో గతేడాది వివాహం చేశారు. ఈ నేపథ్యంలో రంజిత గర్భిణికావడంతో నెల క్రితం తల్లిగారింటికి(సావర్‌ఖెడా)కు వచ్చింది. ఆమెకు సోమవారం ఫిట్స్ వచ్చాయి. తల్లిదండ్రులు వెంటనే ఆసిఫాబా ద్‌లోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో వైద్యులు మంచిర్యాలలోని ప్రైవేట్ ఆస్పత్రికి రెఫర్ చేశారు. అక్కడ సిజేరియన్ చేయడంతో పండంటి బిడ్డకు జన్మనిచ్చింది. చికిత్స పొందుతున్న ఆమె ఒక్కసారిగా ఫిట్స్(మూర్ఛ) రావడంతో మృతిచెందింది. ప్రస్తుతం బిడ్డ ఐసీయూలో చికిత్స పొందుతోంది. కాగా, శ్రీనివాస్, రంజిత ఏడేళ్లుగా ప్రేమించుకున్నారు. ఇరు కుటుంబ సభ్యులు వీరి పెళ్లికి ససేమిరా అన్నారు. తర్వాత తల్లిదండ్రుల ను ఒప్పించి పెళ్లి చేసుకున్నారు. ఎంతో ప్రేమగా..అన్యోన్యంగా ఉన్న ఆ దంపతులపై విధి కన్ను కుట్టింది. రంజిత మృతితో భర్త శ్రీనివాస్, ఇరువురి కుటుంబ సభ్యులు రోదనలు మిన్నంటాయి.

టూటౌన్‌కు రైల్వే ఫుట్ ఓవర్‌బ్రిడ్జి నిర్మించాలి



ప్రచారం చేస్తున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు రఘునాథ్

మంచిర్యాలటౌన్: మంచిర్యాల పట్టణంలోని టూటౌన్ ప్రజల సౌకర్యార్థం హమాలీవాడ రైల్వే ఫుట్ ఓవర్ బ్రిడ్జి నిర్మించాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు రఘునాథ్ వెరబెల్లి అన్నారు. జిల్లా కేంద్రంలోని శ్రీనివాస థియేటర్ ఏరియాలో సోమవారం ప్రధాని నరేంద్ర మోదీ తొమ్మిదేళ్ల పాలనపై మహాజన్ సంపర్క్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరించారు. రైల్వే ఫుట్ ఓవర్ బ్రిడ్జి నిర్మించేందుకు రైల్వే శాఖ సిద్ధంగా ఉన్నప్పటికీ, మంచిర్యాల మున్సిపాలిటీ సిద్ధంగా లేదని, మున్సిపల్ పాలకవర్గం రైల్వే ఫుట్ ఓవర్ బ్రిడ్జి నిర్మాణానికి సహకరించేలా ఏదైనా నిర్ణయం తీసుకోవాలని తెలిపారు. పట్టణ అధ్యక్షుడు వంగపల్లి వెంకటేశ్వర్‌రావు, పెద్దపల్లి పురుషోత్తం జాజు, బోయిని హరికృష్ణ, గాజుల ప్రభాకర్, ముదాం మల్లేశ్, జోగుల శ్రీదేవి, బొద్దున మల్లేశ్, పట్టి వెంకటకృష్ణ, బండి మల్లికార్జున్, పల్లి రాకేశ్, రెడ్డిమల్ల అశోక్, కంకణాల సతీశ్, శివ, చక్రి పాల్గొన్నారు.

బొగ్గు నాణ్యత పాటించాలి

- జీఎం సూర్యనారాయణ

శ్రీరాంపూర్: బొగ్గు నాణ్యత ప్రమాణాలు పాటించాలని సింగరేణి మార్కెటింగ్ జనరల్ మేనేజర్ కె.సూర్యనారాయణ తెలిపారు. సోమవారం శ్రీరాంపూర్ ఏరియా జీఎంతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడారు. మంచి గ్రేడ్ బొగ్గును ఉత్పత్తి చేయాలని అప్పుడే వినియోగదారుల మన్ననలు చూరగొంటామని అన్నారు. దీనికోసం ఏర్పాట్లు చేయాలన్నారు. సీహెచ్‌పీ వద్ద బొగ్గు నాణ్యత చెడిపోకుండా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎస్‌ఓటూ జీఎం గోపాల్‌సింగ్, ఇందారం ఓసీ ప్రాజెక్టు అధికారి ఎం.శ్రీనివాస్, ఏజెంట్లు ఏవి రెడ్డి, రాముడు, మేనేజర్లు అబ్దుల్ ఖాదర్, సంతోష్ కుమార్, సాయిప్రసాద్, విజయ్‌కుమార్, సుధీర్ జక్కులవార్, క్వాలిటీ మేనేజర్ వెంకటేశ్వర్ రెడ్డి, సీనియర్ ఐటీ ప్రోగ్రామర్ శ్రీనివాసులు పాల్గొన్నారు.

వీటీఎస్‌పై సమీక్ష..



సమావేశంలో పాల్గొన్న ఏరియా జీఎం సంజీవరెడ్డి

వెహికిల్ ట్రాకింగ్ సిస్టం(వీటీసీఎస్) పనితీరుపై డైరెక్టర్(పర్సనల్, ఫైనాన్స్)ఎన్.బలరాం సమీక్ష సమావేశం నిర్వహించారు. వీడియో కాన్ఫరెన్సు ద్వారా జరిగిన సమావేశంలో ఏరియా నుంచి జీఎం సంజీవరెడ్డి పాల్గొన్నారు. వీటీఎస్ పనితీరు మరింత మెరుగుపర్చుకోవాలన్నారు. బొగ్గు రవాణా సరైన రీతిలో జరుగడానికి ఇది చక్కగా ఉపయోగపడుతుందన్నారు. సమావేశంలో ఏరియా జీఎం సంజీవరెడ్డి, క్వాలిటీ మేనేజర్ వెంకటేశ్వర్‌రెడ్డి, సెక్యూరిటీ అధికారి మురళీమోహన్ పాల్గొన్నారు.

జీఎంను కలిసిన సిక్కా కమిటీ

శ్రీరాంపూర్: శ్రీరాంపూర్ డివిజన్‌లో నూతనంగా ఎన్నికైన సింగరేణి కాలరీస్ క్లరికల్ అసోసియేషన్ (సిక్కా) కమిటీ సభ్యులు జీఎం బి.సంజీవరెడ్డిని కలిశారు. సిక్కా కేంద్ర కమిటీ అధ్యక్షుడు బొల్లం మధుమోహన్, ప్రధాన కార్యదర్శి వై.సారంగపాణి, కేంద్ర కమిటీ ఉపాధ్యక్షులు ముస్కె సమ్మయ్య, దుర్గాప్రసాద్‌లు ఇటీవల ఎన్నికైన శ్రీరాంపూర్ నూతన కమిటీని జీఎం పరిచయం చేశారు. ఈ సందర్భంగా క్లర్క్‌ల సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఏరియాలోని అన్ని గనులు, డిపార్టుమెంట్లపై అధికారులకు సిక్కా తరపున రిప్రజెంటేషన్ చేయడానికి అనుమతించాలని రాష్ట్ర కమిటీ నాయకులు జీఎంను కోరారు. ఈ సందర్భంగా ఏరియా స్టోర్‌లో సేఫ్టీ మేనేజ్‌మెంట్ ప్లాన్ అమలు చేయాలని అక్కడి క్లర్క్‌లపై ఒత్తిడి తెస్తున్నారని తెలిపారు. సంబంధం లేని పని చేయాలని ఒత్తిడి తెస్తున్నారన్నారు. సమావేశంలో సిక్కా ఏరియా ఉపాధ్యక్షుడు కన్నం సాంబయ్య, ఫైనాన్స్ కార్యదర్శి జిల్లాల రవి, జాయింట్ సెక్రెటరీలు బదిరి బుచ్చయ్య, గంట విజయలక్ష్మి, ఆర్గనైజింగ్ సెక్రెటరీలు సుద్దాల శ్రావణ్ కుమార్, నిర్మలాదేవి, ఎగ్జిక్యూటివ్ సభ్యులు లింగం నాగలక్ష్మి, నవీన్‌కుమార్, మహేష్, కందుకూరి సురేష్, శివశంకర్, సుద్దుల సురేష్ తదితరులు పాల్గొన్నారు.



జీఎంకు నూతన కమిటీ వివరాలు అందజేస్తున్న సభ్యులు

అద్దె వాహనాల ఓనర్ల సమస్యలు పరిష్కరించాలి

జైపూర్: జైపూర్ సింగరేణి థర్మల్ పవర్ ప్లాంటు భూనిర్వాసిత అద్దె వాహనాల ఓనర్ల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఎస్టీపీపీ జీఎం సూర్యనారాయణరాజుకు సోమవారం వినతిపత్రం అందజేశారు. అన్ని ఏరియాల్లో భూనిర్వాసతులైన అద్దె వాహనాల ఓనర్లు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి ఏరియాల వారీగా వినతిపత్రాలు అందజేస్తున్నట్లు తెలిపారు. 2017 నుంచి యూనిట్ రేటు పెంచడం లేదని, మూడేళ్ల కాలపరిమితిని ఆరేళ్లకు పెంచాలని వినతిలో కోరారు. పెండింగ్‌లో ఉన్న డ్రైవర్ల ఈపీఎఫ్‌లు విడుదల చేయడంతోపాటు పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని జీఎంకు అందజేశారు. సమస్యలు పరిష్కరించకపోతే వచ్చే నెల 6 నుంచి సింగరేణి వ్యాప్తంగా సమ్మెకు దిగుతామని ఎస్టీపీపీ భూనిర్వాసిత అద్దె వాహనాల ఓనర్ల గౌరవ అధ్యక్షుడు రిక్కుల శ్రీనివాస్‌రెడ్డి, అధ్యక్షుడు రామటెంకి తిరుపతి హెచ్చరించారు.



జీఎం సూర్యనారాణరాజుకు వినతిపత్రం ఇస్తున్న అద్దెవాహనాల యూనియన్ నాయకులు

అజీమ్ ప్రేమ్‌జీ యూనివర్సిటీలో సీఓఈ విద్యార్థికి సీటు

బెల్లంపల్లి: ప్రభుత్వ సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల సెంటర్ ఆఫ్ ఎక్సలెన్సీ (సీఓఈ) బెల్లంపల్లి కళాశాల విద్యార్థి ప్రతిష్టాత్మక అజీమ్ ప్రేమ్ జీ యూనివర్సిటీలో సీటు సాధించాడు. సీఓఈలో ఇంటర్మీడియెట్ పూర్తి చేసుకున్న మల్లెపూల సాయితేజ బెంగళూరులోని అజీమ్ ప్రేమ్ జీ యూనివర్సిటీలో ప్రవేశం కోసం పరీక్ష రాశాడు. రాతపరీక్ష ఆన్‌లైన్‌లో నిర్వహించిన మౌఖిక పరీక్షలో నైపుణ్యత కనబర్చడంతో సీటు వరించింది. సాయితేజ..అండర్ గ్రాడ్యూయేషన్ బీఎస్సీ బీఎడ్ సీటు దక్కించుకుని ప్రతిభ చాటుకున్నట్లు ప్రిన్సిపాల్ ఐనాల సైదులు ప్రకటించారు. సాయితేజతోపాటు సీఓఈలో చదివిన తాటి సాయి, సునార్కర్ అఖిలేశ్వర్ కూడా సీట్లు సాధించినట్లు వివరించారు. కష్టపడే తత్వం, పట్టుదల ఉంటే ఏ యూనివర్సిటీలోనైనా సీటు సాధించవచ్చని సీఓఈ విద్యార్థులు నిరూపిస్తున్నారని ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఆర్‌సీవో స్వరూపరాణి సోమవారం ప్రశంసించారు.



సాయితేజను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ సైదులు